## క్లుప్తంగా

### పూజలకు సిద్ధమైన అభయాంజనేయస్వామి ఆలయం


రాష్ట్ర రహదారిపై పూజలకు సిద్ధంగా అభయాంజనేయస్వామి ఆలయం

సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి రామ మందిరాలు, అభయాంజనేయ స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాలు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించడానికి అర్చకులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. అలాగే స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులతో నిర్వహించనున్న శోభాయాత్రకు జెండాలు ఏర్పాటు చేశారు.

### ఎస్‌ఈబీ సీఐగా జోగమ్మ

కురుపాం: స్థానిక ఎస్‌ఈబీ సీఐగా డీసీహెచ్ జోగమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లాలోని జోడవరం ఎస్‌ఈబీ సీఐగా పనిచేసిన ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. మద్యం, సారా అక్రమ రవాణా, తయారీ, విక్రయాలను అరికట్టేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

### సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతుల ఆసక్తి


పశువుల గత్తం కోసం ఉద్దవోలు గ్రామ పొలాల్లో వేసిన గొర్రెల మంద

గరుగుబిల్లి: మండలంలోని రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి కనబరుస్తున్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలపై వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తుండడంతో అన్నదాతలు ఒక్కొక్కరుగా సేంద్రియ ఎరువులు వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ఇప్పుడు పొలాల్లో గొర్రెలు, మేకలు మందలు వేసి, భూమికి కావాల్సిన పోషకాలు అందేలా చేస్తున్నారు. వేరుశనగ, అరటి, నువ్వులు, కాయగూరలు తదితర పంటల సాగుతో పాటు వరిసాగు చేసే వారు కూడా గొర్రెలు, మేకల మందలు వేస్తున్నారు. మరోవైపు పశువుల గత్తం, చెరువు మట్టిని కూడా పొలాల్లో వేస్తూ నేలను సారవంతం చేస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### చురుగ్గా కులగణన సర్వే

పాలకొండ: మండలంలో కులగణన సర్వే చురుగ్గా సాగుతోంది. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. అధిక గ్రామాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో రాత్రి సమయంలో కూడా కులగణన సర్వే చేస్తున్నారు. క్లస్టర్ వారిగా వివరాలు సేకరిస్తున్నట్లు ఎంపీడీఓ త్రినాథ్ తెలిపారు.

### పుస్తకావిష్కరణ

రాజాం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ టౌన్ కార్యాలయంలో రాజాం పట్టణానికి చెందిన రచయిత సూర్యరత్న ఆసపు సూర్యం రాసిన కోలాటం భక్తిగీతాలు–2 పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రాజాం ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతిల చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రాముఖ్యత సంతరించుకున్న కోలాటం ఇప్పుడు అన్ని గ్రామాలకు వ్యాపించిందని, ఈ కోలాటానికి సంబంధించి, భక్తి, జానపద గీతాలను సూర్యం ఎంతో చక్కగా రాశారన్నారు. ఈ పుస్తకంలో శ్రీగణేష, నవదుర్గాదేవి, పోలిపల్లి పైడితల్లి, అయ్యప్పస్వామి, వాసవీ, మెహర్‌బాబాతో పాటు సకల దేవతల భక్తిగీతాలు ఉన్నాయన్నారు. అక్కడికి వచ్చిన వారికి ఉచితంగా ఈ పుస్తకాలు అందజేశారు. అనంతరం పుస్తక రచయిత సూర్యంను ఘనంగా సత్కరించారు.

### ఆరోగ్య తనిఖీలు

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎల్.ప్రదీప్, కొంతమంది సిబ్బంది కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి, గ్రామస్తులకు వైద్యసేవలు అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

### చోడిసాగుపై అవగాహన

రేగిడి: మండలంలోని పోరాం, కాగితాపల్లి, ఉనుకూరు, సరసనాపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద చోడిసాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో ఎక్కువగా సాగు చేస్తే ఈ పంటతో అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఈ సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

# వైఎస్సార్‌సీపీ చేతల ప్రభుత్వం

● ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


సాలూరు: మోసూరులో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను పల్లకిలో ఊరేగిస్తున్న స్థానిక నాయకులు, ప్రజలు


పాచిపెంట: మాతుమూరులో వంతెన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట/సాలూరు: వైఎస్సార్‌సీపీ చేతల ప్రభుత్వం అని, టీడీపీ మాటల పార్టీ అని, ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలో రూ.10 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న మాతుమూరు వంతెన, రూ.7.68 కోట్లతో నిర్మాణం పూర్తయిన మోసూరు వంతెనలను ప్రారంభించారు. దశాబ్దాల వంతెన సమస్యను తీర్చిన రాజన్నదొరను మోసూరు నాయకులు, ప్రజలు పల్లకిలో ఊరేగించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో రాజన్నదొర మాట్లాడుతూ, ఈ వంతెనలు లేక ఈ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. గత ప్రభుత్వం ప్రజల కష్టాలను విస్మరించిందని విమర్శించారు. ప్రజల కష్టాలు పరిష్కరించాలని తాను నిశ్చయించుకుని ఈ వంతెనలను మంజూరు చేయించడంతో పాటు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నానని వివరించారు. ప్రజలకు మేలు చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల, జెడ్పీవైస్‌చైర్మన్ కొత్రజన్ని సింహాచలం, స్థానిక సర్పంచ్‌లు గండిపల్లి చంటి, బోను ఉషారాణి, ఎంపీటీసీలు రొంగలి మోహనరవళి, కొల్లి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి డోల బాబ్జీ, వైస్ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎలక్టోరల్ ఫైనల్ రోల్స్ సరిచేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఫైనల్ ఎలక్టోరల్ రోల్స్ వచ్చినందున బీఎల్వోలు ఓటర్ల జాబితాలను పరిశీలించి ఎటువంటి అభ్యంతరాలున్నా సోమవారం సరి చూసుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ ఎలక్టోరల్ ఫైనల్ రోల్స్ జాబితా విడుదల కావడంతో బీఎల్వోలు పరిశీలించి చేర్పులు, సవరణలు, తొలగింపులకోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించి సరిచేసు కోవాలని కోరారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్వోల వద్ద, మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ఉందన్నారు. జాబితాల్లో తమ పేర్లున్నవీ లేనివీ సరిచేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలియజేశారు. అలాగే 2024 జనవరి 22 నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన వారందరూ ఓటుహక్కు పొందడానికి అవసరమైన దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలో సీతానగరం మండలంలోని పోలింగ్ కేంద్రం 105 నుంచి 166 వరకూ పోలింగ్ బూత్‌లున్నాయని తెలియజేశారు. నిర్దేశించిన పోలింగ్ బూత్‌లలో ఓట్లున్న వారు ఎటువంటి సందేహాలున్నా బీఎల్వోలను, తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. అభ్యంతరాలను నివృత్తి చేసిన అనంతరం ఓటర్ల జాబితా తయారు చేయడానికి వీలవుతుందని వివరించారు.

## ప్రయాణికుల భద్రతకు తొలి ప్రాధాన్యం

పాలకొండ రూరల్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల భద్రతతో పాటు, తమ వ్యక్తిగత భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక డిపోలో సహోద్యోగులతో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ.. విధులకు హాజరయ్యే డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడాలపాలన్నారు. డిపో నుంచి బస్సు బయటకు తీసుకువెళ్లే ముందు గ్యారేజీలో ఓసారి వాహనాన్ని పరీక్షించుకోవటం మేలన్నారు. విధి నిర్వహణలో సెల్‌ఫోన్ వాడటం, నిర్లక్ష్యంగా వ్యవహరించటం మానుకోవాలని సూచించారు.

## చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం మంజూరు


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారి తల్లిదండ్రులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాం 18వ వార్డుకు చెందిన బోను శ్రీను కుమార్తె లాలస చిన్ననాటినుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల 18వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి స్థానిక మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరి ఆ చిన్నారి సమస్యను తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పాపగుండె ఆపరేషన్ కోసం అవసరమయ్యే ఆర్థిక సహాయం మంజూరు చేయడం గురించి సీఎం కార్యాలయం అధికారులతో మాట్లాడారు. స్వయానా అమరావతిలోని సచివాలయానికి వెళ్లి పాప సమస్యను వివరించారు. తక్షణమే స్పందించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.10 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యే జోగారావును ఆదివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో కలుసుకుని తమను ఆపదకాలంలో ఆదుకున్న ఎమ్మెల్యేకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేసి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి


మాట్లాడుతున్న సీఐ జి.దేముడుబాబు

సాలూరు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ జి.దేముడుబాబు హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని మజ్జులవీధి సమీపంలో ప్రజలు, యువతతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో కొందరు యువత డబ్బుకు ఆశపడి సారా వ్యాపారాల్లో దూరుతూ అరెస్ట్ అవుతున్నారని. తద్వారా బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్ పట్ల బంగారు కలలు కంటారని, చెడు మార్గాల్లో దూరి భవిష్యత్‌ను చేజేతులా పాడుచేసుకోవద్దని హితవు పలికారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేకుండా వాహనాలు నడుపరాదని, రికార్డులు లేని వాహనాలను తీయరాదని పలు ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. చట్టాలను ఉల్లంఘిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

## ప్రారంభానికి సిద్ధంగా ఇంటింటి కుళాయిలు

● మరిపివలసలో 302 ట్యాప్‌ల నిర్మాణం


మరిపివలసలో ప్రధాన పైప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ హనుమంతరావు, ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: పట్టణ, గ్రామీణ ప్రజల అవసరాలకు అనుగుణంగా మంచినీరు సరఫరా చేయడానికి పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ హనుమంతరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని మరిపివలసలో రూ.31 లక్షల వ్యయంతో జరుగుతున్న 302 గృహాలకు ఇంటింటి కుళాయిల పనులను ఆదివారం ఆయన ఏఈ ఆర్.పవన్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే అండర్‌గ్రౌండ్‌లో ప్రధాన పైప్‌లైన్లు వేయడం, ప్రధాన పైప్‌లకు ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు ట్యాప్ కనెక్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ జరుగుతున్న పనులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ గతంలో సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి కుళాయి నిర్మాణం చేపట్టడం వల్ల ప్రజల అవసరాలకు అనుగుణంగా నీరువినియోగానికి ఉపయోగపడుతుందన్నారు. మూడు నెలలక్రితం పనులు ప్రారంభించామని, ఉన్నతాధికారులు నిర్దేశించిన గడువులోగా నిర్వాహకులు పనులు పూర్తి కావస్తున్నందున ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే లచ్చయ్యపేట, అంటిపేట, వెంకటాపురం, వెన్నెలబుచ్చింపేట, రామవరం, రెడ్డివానివలస, చిన్నారాయుడుపేట, లక్ష్మీపురం, గుమ్మిడివరం, బూర్జ గ్రామాల్లో ఇంటింటి కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఇంటింటి కుళాయిలు వినియోగిస్తున్న వారు ఇంటికి సరిపడా నీరు వాడిన తరువాత విధిగా ట్యాప్‌ల వద్ద నీరు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

## సూర్యపీఠంలో రామాయణమంత్ర హవనం


హోమాన్ని నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ నరహరి శాస్త్రి

పార్వతీపురంటౌన్: అయోధ్యలో బాలరామ మందిరం ప్రతిష్ఠను పురస్కరించుకుని స్థానిక సూర్యపీఠంలో సూర్యవంశకీర్తి పతాక రామచంద్ర ప్రభువును కొలుస్తూ యజ్ఞశాలలో సకల కార్యసిద్ధి రామాయణ మంత్ర హోమాన్ని బ్రహ్మశ్రీ నరహరి శాస్త్రి అధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. యుగ పురుషుడు శ్రీరామ జన్మస్థలం వేలాదిగా యతీశ్వరులు, యోగులు, మహర్షులు, తపస్విలు, ఉపాసకుల దివ్యధామంగా విరాజిల్లుతూ ప్రపంచానికి 'మోక్ష పురం'గా నిలుస్తోందని సప్త మోక్ష పురాల్లో మొదటిది అయోధ్య అని శాస్త్రి అన్నారు. వేదభూమి, ధర్మ భూమి, కర్మభూమి భారతదేశం అని మరోసారి రుజువవుతోందన్నారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, కేశవ శర్మ, టీఆర్ కృష్ణశర్మ, వైదిక సహకారం అందించారు. రామతారక మంత్రాన్ని పఠిస్తూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అయోధ్యలో పాచిపెంట కళాకారుల ప్రదర్శన


పాచిపెంట: అయోధ్యలో తప్పెటగుళ్ల ప్రదర్శన ఇస్తున్న పాచిపెంట కళాకారులు

పాచిపెంట: అయోధ్యలో జరుగుతున్న శ్రీరామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాచిపెంట మండల కళాకారులు ప్రదర్శన ఇస్తున్నారు. పాచిపెంట మండల కేంద్రం, కొత్తవలస గ్రామాలకు చెందిన మద్దు నూకరాజు బృందం తప్పిటగుళ్ల ప్రదర్శన మూడు రోజులుగా అయోధ్యలో ఇస్తున్నట్లు, భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు నూకరాజు సాక్షికి ఫోన్‌లో తెలిపారు.

## నేడు నియోజకవర్గ సన్నాహక సమావేశం

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం నియోజకవర్గ సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంబంధించి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27న భీమిలిలో వైఎస్సార్‌సీపీ కేడర్ తొలి ప్రాంతీయ సమావేశాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రారంభిస్తారన్నారు. 2024 ఎన్నికల తొలి సమావేశానికి పార్వతీపురం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ కుటుంబసభ్యులు పాల్గొనాలని కోరారు. ఈ నేపథ్యంలో తన అధ్యక్షతన పోలీస్‌స్టేషన్ రోడ్డు వద్ద గల ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం పరిశీలకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు, సర్పంచులు, మండల, సచివాలయం మొబిలైజేషన్ పీఓలు, ఇతర మండల స్థాయి సీనియర్ నాయకులు అందరూ తప్పక హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## శ్రమదానంతో సుందరంగా కోనేరు

సీతానగరం:


అంటిపేటలో సుందరంగా తీర్చిదిద్దిన మంచినీటి కోనేరు

మండలంలోని రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న అంటిపేటలో మంచినీరు కోనేరు ప్రస్తుతం సుందరంగా దర్శనమిస్తోంది. పూర్వం రహదారిపై దూరప్రాంతాలకు వెళ్లేవారంతా నాటుబళ్లకు నీడనిచ్చే గూడుకట్టి ప్రయాణం చేసేవారు. గ్రామాల్లో రైతులు అరుగాలం కష్టించిన పండించిన చెరకు, ధాన్యం, గోగునార, వేరుశనగ తదితర వ్యవసాయ ఉత్పత్తులను నాటుబళ్లతో బొబ్బిలి పట్టణానికి తరలించే వారు. ఇళ్ల నుంచి రాత్రిపూట నాటుబళ్లతో బయల్దేరిన రైతులు అంటిపేటకు వచ్చే సమయానికి చద్దెన్నం తినే సమయమయ్యేది. దూరప్రాంతాల నుంచి నాటుబళ్లతో వచ్చిన రైతులకు అంటిపేట మంచినీరు కోనేరు విడిదిగా ఉండేదని వృద్ధ రైతులు అంటున్నారు. అలాగే కోనేరులో స్నానాలు చేస్తే చర్మవ్యాధులు నివారణ అవుతాయిని నానుడి. ఇప్పటికీ దూర ప్రాంతాల నుంచి రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు చెట్ల కింద సేద తీరుతారు. అంతటి చరిత్ర కలిగిన మంచినీటి కోనేరును పట్టించుకునేవారే కరువయ్యారు. ఈ నేపథ్యంలో దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, పట్ట ణాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నవారు, స్థానిక యువకులంతా ఒకటై లక్షలాది రూపాయలు పోగు చేసి గ్రామానికి ఏదైనా మంచి కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించి కోనేరు గట్టును, చెరువును శుద్ధి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దడానికి నడుం బిగించి శ్రమదానం చేస్తూ సుందరవనంగా తయారు చేశారు. యువకులే అంతకుముందు చెరువు గట్టుపై వేప–రావి మొక్కలు నాటగా రోజురోజుకు అవి పెరుగుతుండడంతో వాటి చుట్టూ రచ్చబండ నిర్మించారు. కార్తీక మాసంలో పూజలు చేయడం, సుందరంగా తయారుచేసిన చెరువుగట్టుపై సిమెంట్ బల్లలు, కుర్చీలు ఏర్పాటు చేయడంతో బాటసారులు, స్థానికులు, విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం –సాయంత్రం అక్కడే కూర్చుని కథలు, పురాణ కాలక్షేపం చేస్తున్నారు. శ్రమదానంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిన యువకులను చెరువు చరిత్ర తెలిసిన వారు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.


కోనేరు గట్టుపై రచ్చబండ, చుట్టూ నాటిన మొక్కలు

## శాశ్వతంగా మరుపెంట జాతర రద్దు

గరుగుబిల్లి: మక్కువ మండలంలోని శంబర పోలమాంబ జాతర జరిగే సమయంలో మండలంలోని మరుపెంట గ్రామంలో నిర్వహించే చినశంబర పోలమాంబ జాతరను పూర్తిగా రద్దు చేసినట్లు సర్పంచ్ ఉరిటి నిర్మల, ఎంపీపీ ఉరిటి రామారావు ఆదివారం తెలిపారు. కోవిడ్ విపత్తు కారణంగా అప్పట్లో రెండేళ్లు జాతర జరపలేదని, ఆ తర్వాత సంవత్సరం కూడా గ్రామంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, పలువురు అనారోగ్యంతో బాధపడుతుండడంతో జాతర చేయలేదన్నారు. ఇప్పుడు శాశ్వతంగా జాతరను రద్దు చేస్తూ తీర్మానం కూడా చేయడం జరిగిందని, ఇదే విషయాన్ని రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. గ్రామస్తులు, భక్తులు, సందర్శకులు, పర్యాటకులు కూడా గమనించాలని వారు కోరారు.

## భీమిలి సభకు సమాయత్తం కావాలి

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: విశాఖ జిల్లాలోని భీమిలిలో ఈ నెల 27వ తేదీన జరిగే వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు కోరారు. ఇదే విషయమై వారు మండలంలోని చినమేరంగిలో ఉన్న వారి స్వగృహంలో పార్టీ ముఖ్య నేతలతో ఆదివారం సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా సభలో పార్టీ శ్రేణులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రతీ ప్రాంతం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సభకు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు



## నిజమైన గిరిజనులకే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు తేజేశ్వరరావు

భామిని: రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఎస్టీ నియోజకవర్గాల్లో నిజమైన, స్థానిక గిరిజనులకే పార్టీ టిక్కెట్లు కేటాయించాలని రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. భామినిలో జిల్లా జాయింట్ సెక్రటరీ పిరపక శ్రీనివాసరావు, రాష్ట్ర సభ్యులు నిమ్మల మోహనరావులతో కలిసి గిరిజనుల హక్కులపై ఆదివారం మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 330, 332 ప్రాప్తికి చట్ట సభల్లో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పిస్తోందన్నారు. వాటిని పట్టించుకోకుండా కొందరు నకిలీ గిరిజన ధ్రువపత్రాలతో పోటీలకు దిగి నిజమైన స్థానిక గిరిజనులకు తీవ్ర ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ గిరిజనులు, స్థానికేతరలకు టిక్కెట్లు కేటాయిస్తే గిరిజనులు ఐక్యంగా ఓడిస్తారని హెచ్చరించారు. ఇప్పటికే నకిలీ గిరిజన ధ్రువపత్రాల మంజూరుపై ఇచ్చిన ఫిర్యాదులపై డీఎల్ఎస్‌సీ త్వరితగతిన విచారణ చేపడితే నిజమైన గిరిజనుల హక్కులు పరిరక్షింప బడతాయన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌ను పక్కదారి పట్టించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. ఈ నెల 27న అరకు పార్లమెంట్ ఎస్టీ నియోజకవర్గ కేంద్రంలో గిరిజన జేఏసీ నిర్వహించనున్న మేథోమథన సదస్సును మేధావులు, విద్యార్థి, యువజన విభాగం హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక నాయకులు ఊయక సింహాచలం, కీర్తిరాయి సుగ్రీవులు, కద్రక లక్ష్మీనారాయణ, బిడ్డిక మురళీ ఉన్నారు.